సాక్షి
వైఎస్సార్ జిల్లా
శనివారం । 8 । మార్చి । 2025






## న్యూస్‌రీల్

### ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష

కడప ఎడ్యుకేషన్: ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. మ్యాథ్స్–2ఎ, బాటనీ, సివిక్స్ పరీక్షలకు సంబంధించి 600 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. జిల్లావ్యాప్తంగా 64 పరీక్షా కేంద్రాల్లో జనరల్, ఒకేషన్‌కు 15061 మందికి 14461 మంది హాజరయ్యారని చెప్పారు.

### టెన్త్ పరీక్షలకు ఉచిత ప్రయాణం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభమయ్యే టెన్త్ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు ఏపీఎస్ ఆర్టీసీ ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనుందని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్ ఆధారంగా ఏ విధమైన బస్సు పాస్ లేకపోయినా కూడా పల్లె వెలుగు/ అల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో ఉచిత ప్రయాణించవచ్చన్నారు. పరీక్షలున్న రోజుల్లో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### నిధుల అవకతవకలు: ఇద్దరిపై చర్యలు

కడప సెవెన్‌రోడ్స్: గ్రామ పంచాయతీ నిధుల్లో అవకతవకలకు పాల్పడిన ఇద్దరిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ప్రొసీడింగ్స్ జారీ చేశారు. రాజుపాలెం మండలం ఏరువపాలెం గ్రామ పంచాయతీ గ్రేడ్–3 సెక్రటరీగా పనిచేసి ప్రస్తుతం జిల్లా పరిషత్ రీసోర్స్ పర్సన్‌గా విధులు నిర్వర్తిస్తున్న బి.పుల్లారెడ్డి రూ. 4,25,986లను వ్యక్తిగతంగా డ్రా చేసుకుని స్వంత అకౌంట్‌లో జమ చేసుకున్నారని ఆరోపణలు రుజువు కావడంతో ఆయనను సస్పెండ్ చేశారు. అలాగే చాపాడు మండలం బద్రిపల్లె గ్రామ పంచాయతీకి చెందిన రూ. 2,56,325 దుర్వినియోగం చేసిన ఆరోపణలు రుజువు కావడంతో మండల స్థాయి కంప్యూటర్ ఆపరేటర్ షేక్ హనీఫ్‌బాషాను విధుల నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

### 9న రాయలసీమ సమగ్ర అభివృద్ధిపై చర్చా వేదిక

ప్రొద్దుటూరు: పట్టణంలో ఈనెల 9న రాయలసీమ సమగ్ర అభివృద్ధిపై ఉమ్మడి కడప జిల్లా స్థాయి చర్చావేదిక నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి వేదిక రాష్ట్ర కన్వీనర్ నాగరాజు తెలిపారు. శుక్రవారం ప్రొద్దుటూరు ఉపవిద్యాశాఖ కార్యాలయం వద్ద చర్చావేదిక కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన నేపథ్యంలో రాయలసీమ ప్రాంత ప్రజలు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని తెలిపారు. కరువు ప్రాంతమైన రాయలసీమలో యువత ఉపాధి లేక వలస పోతున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఆర్థికంగా చితికిపోతున్నారన్నారు. ఈ చర్చా వేదికలో ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సేవా సంఘం నాయకుడు ఏవీ రమణ, వీరనారాయణరెడ్డి, ఎర్ర వెంకటేష్, నాగిశెట్టి ప్రసాద్, మాధవరెడ్డి, భీమరాజు పాల్గొన్నారు.

### జాతీయ రహదారి భూసేకరణ పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్‌లో జాతీయ రహదారి భూసేకరణ పురోగతి పనులపై రెవెన్యూ, జాతీయ రహదారి అధికారులతో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తో కలసి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారి భూసేకరణకు సంబంధించి జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. టైటిల్ వివాదాలు,రెవిన్యూ భూ వివాదాలకు సంబంధించి ఓపెన్ ఫోరం ఏర్పాటు చేసి గ్రామాల వారీగా ప్రజలతో మాట్లాడి భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. తొలుత జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ జాతీయ రహదారి భూసేకరణ పనుల పురోగతి పై ఆయా పనుల వారిగా అధికారులతో సమీక్షించారు.

# వనిత.. విజేత

మహిళలు సున్నితమైన వారు.కష్టమైన పనులు చేయలేరు...అన్నది ఇంతవరకు ప్రజల్లో ఉన్న నమ్మకం. కానీ ఇటీవలి కాలంలో ఆ అభిప్రాయం చెల్లాచెదురై పోయింది. ఇంటి నుంచి మింటి వరకు అవకాశాలను అందిపుచ్చుకుంటూ అన్నింటా తానై దూసుకుపోతోంది మగువ. అబ్బురపరిచే విజయాలతో అందరి అభినందనలు అందుకుంటోంది వనిత. అనిర్వచనీయ పాత్రలో అంతులేని ఆత్మవిశ్వాసంతో తనకు తానే సాటిగా.. పోటీగా ముందుకు సాగుతోంది నేటి మహిళ. భూమిని చీల్చి పంటలు పండించడం నుంచి ఆకాశంలో రివ్వుమని విమానాలు నడపడంలో కూడా ప్రతిభ చూపుతున్నారు. కొలిమి పనులు, ఖాకీ దుస్తుల ఉద్యోగాల నుంచి రైలు పైలెట్లుగా, ఆర్టీసీ కండక్టర్లుగా రాణిస్తున్నారు. కొన్నిచోట్ల తమకు మాత్రమే గల సున్నితత్వాన్ని ప్రదర్శిస్తూ ప్రత్యేకతలు చాటుకుంటున్నారు. దేంట్లో అయినా తగ్గేదేలా అంటున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.

–కడప కల్చరల్

- అన్ని రంగాల్లో అతివల ప్రతిభ
- ప్రతిభామూర్తుల పరిచయాలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం



## ఆమె చిత్రం అపురూపం



మంజులారాణి

వైఎస్సార్ జిల్లా చింతపూతాయపల్లె గ్రామానికి చెందిన చల్లగాలి మంజులారాణి కష్టతరమైన భావాలను గీతల్లో పలకించే విలక్షణ చిత్రకారిణి. భర్త గొల్లపల్లి జయన్న రాష్ట్ర ప్రభుత్వ హంస అవార్డు పొందిన చిత్ర, శిల్పకారుడు కావడంతో ఆమె తన ప్రతిభకు మెరుగులు దిద్దుకుంది. ప్రత్యేక శైలిగల చిత్రకారాణిగా ఆమె ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉనికిని చాటుకున్నారు. మహిళా సమస్యలను ప్రతిబింబించేలా ప్రతీకాత్మక చిత్రాలను గీయడం మంజులారాణికి రంగులతో పెట్టిన విద్య, మరీ ముఖ్యంగా మాతృత్వం తొణికిసలాడే అమ్మ చిత్రాలు, మురిపాలు ఆస్వాదిస్తూ తన్మయత్వంలో మునిగిన చిన్నారుల చిత్రాలు ఆమె చిత్రాలకు సంతకాలుగా నిలుస్తున్నాయి. ఆమె పలు జాతీయ, అంతర్జాతీయ చిత్ర కళా ప్రదర్శనల్లో పాల్గొని బహుమతులను సాధించారు.యువ చిత్రకారులను ప్రోత్సహిస్తున్నారు.

## మేరీ.. సేవా నారీ



అనాథ శవాలకు అంత్య క్రియలు నిర్వహిస్తున్న పాల మేరీ సునీత (ఫైల్)



పాల మేరీ సునీత

కమలాపురం: ప్రస్తుత సమాజంలో రక్త సంబంధీకుల మృతదేహాలను చూసేందుకు జంకుతున్న తరుణంలో నేను సైతం అంటూ అనాథ మృత దేహాలకు అంత్యక్రియలు చేసేందుకు ముందుకు వస్తున్నారు కమలాపురం పట్టణం, కె. అప్పాయపల్లెకు చెందిన పాల మేరీ సునీత... కరోనా సమయంలో ఎవరైనా మృతి చెందితే సొంత కుటుంబ సభ్యులే చూసేందుకు ముందుకు రాని సందర్భాల్లో సునీత తన భర్త భూపాళం వెంకట లక్ష్మణ్ కుమార్ ప్రోత్సాహంతో అభి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ విజయ్ బాబు సహకారంతో మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు ధైర్యంగా ముందుకు వచ్చారు. కరోనా కష్టకాలంలో 8 మంది మహిళల మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. విజయ్ బాబు స్థాపించిన ట్రస్ట్‌లో 2021లో సభ్యురాలిగా చేరారు. ఎక్కడైనా అనాథమృతదేహాలు ఉన్నాయనే సమాచారం వస్తే సునీత తన భర్త లక్ష్మణ్, సోదరుడు కరుణాకర్, ట్రస్ట్ ఛైర్మన్ విజయ్‌బాబుతో కలసి అక్కడికి చేరుకుని మృతి చెందిన వారి మతాను సారం అంత్యక్రియలు నిర్వహిస్తూ, మానవత్వం చాటుతూ ముందుకు సాగుతున్నారు. ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఇప్పటి వరకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మృతి చెందిన 42 మంది పేద, అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. ఎక్కడైనా అనాథ మృతదేహాలు ఉంటే తమకు సమాచారం ఇస్తే వచ్చి ఉచితంగా అంత్యక్రియలు నిర్వహిస్తామని చెబుతోంది పాల మేరీ సునీత.

## ఆటాడించి...అగ్రస్థానంలో నిలిచి



ఎల్.వెంకట లక్ష్మిదేవి

విద్యార్థులకు ఆటపాటలు అక్కర్లేదని, అవి అన్నం పెట్టవని, పైగా చదువు పాడవుతుందని తల్లిదండ్రులు తేలిగ్గా చూస్తున్నారు. ఇలాంటి దశలో క్రీడారంగంలో తనదైన పట్టు సాధించి ఆణిముత్యాల్లాంటి విద్యార్థులను గుర్తించి వారి ప్రతిభను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళుతోంది ఆమె. తాను పనిచేస్తున్న పాఠశాల గౌరవాన్ని రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపిన డ్యాషింగ్ లేడీ, కడప నగర పాలక సంస్థ (మెయిన్) స్కూలు ఫిజికల్ డైరెక్టర్ ఎల్.వెంకట లక్ష్మిదేవి. 2012లో ఆమె బదిలీపై మున్సిపల్ మెయిన్‌హైస్కూలుకు వచ్చారు. మైదానంలో దిగారు. అంతవరకు స్తబ్దుగా ఉన్న క్రీడాపరికరాలకు చలనం వచ్చింది. ఫలితంగా ఆ స్కూలు రాష్ట్ర స్థాయిలో రెండుసార్లు ద్వితీయ స్థానం దక్కించుకుంది. ఆ తర్వాత ఏకంగా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచి కడప పతాకాన్ని రెపరెపలాడించింది. దీంతో మున్సిపల్ హైస్కూలు మెయిన్ పాఠశాలను ప్రజలు క్రీడా పాఠశాలగా వ్యవహరిస్తున్నారు. మా వాడికి ఆటలు వద్దు అంటూ వెనక్కి తీసుకెళ్లిన బాలలను పదో తరగతిలో టాపర్లుగా నిలిపి వాళ్ల అభిప్రాయం తప్పని నిరూపించారు. తన శ్రమతో పలువురు విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో క్రీడా బహుమతులు సాధించేలా చేసింది. ఫిజికల్ డైరెక్టర్‌గా ఎల్.వెంకటలక్ష్మి తాను అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. ఇప్పుడామె వైఎస్సార్ జిల్లాలో క్రీడా శిక్షణకు ఐకాన్‌గా నిలిచారు.

## సేవా పథంలో పయనం



నెమలిదిన్నె నాగవేణి

కడప నగరానికి చెందిన నెమలిదిన్నె నాగవేణి పరిచయం అవసరం లేని సామాజిక సేవా కార్యకర్తగా గుర్తింపు సాధించుకున్నారు. నిజానికి ఆమె నిరుపేద కుటుంబానికి చెందిన యువతి. అయినా నగర పరిధిలోని అనాథ, వృద్ధులు, మహిళల ఆశ్రమాల్లో దుప్పట్లు, నూతన వస్త్రాలు, అన్నదానాలు చేస్తూ వారి అభిమానాన్ని సాధించుకున్నారు. రక్త సేకరణ శిబిరాలు, గుండె సంబంధిత వైద్య శిబిరాలు నిర్వహిస్తుంటారు. దీపావళికి జువైనల్ హోంలోని బాలలందరికీ నూతన వస్త్రాలు, విందు భోజనం అందిస్తారు. వారితో కలిసి టపాసులు కాల్చి ఆనందిస్తారు. అధికారుల చుట్టూ తిరుగుతూ సేవా కార్యక్రమాల్లో వారు కూడా భాగస్వాములు అయ్యేలా చూస్తారు. ప్రైవేటుగా పీజీ చేస్తున్న ఆమె ప్రస్తుతం కడప నగరంలో పర్యాటక శాఖలో చిరుద్యోగిగా సేవలు అందిస్తున్నారు. ఇంతవరకు ఒక్క అన్నం పొట్లం కూడా ఇంటికి తీసుకెళ్లని ఆమెను విశ్వసించిన పలువురు మానవతా వాదులైన దాతలు ఆమె ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తనపై ఉన్న నమ్మకాన్ని చిరకాలం నిలబెట్టుకునేందుకే ప్రయత్నిస్తానని, తనను చూసిన వెంటనే ఆర్తుల ముఖాల్లో కనిపించే వెలుగును చూస్తే తన హృదయం ఆనందంతో నిండిపోతుందనంటారు నాగవేణి. అందుకు ఆమెను జిల్లా స్థాయి అధికారులు సైతం అభిమానిస్తారు.

## తండ్రి స్ఫూర్తితో.. ఆయన అడుగుజాడల్లోనే...



పుత్తా పద్మ, వైవీయూ రిజిస్ట్రార్

కడప ఎడ్యుకేషన్: మేము చిన్నతనం నుంచే తండ్రి స్ఫూర్తితో తీసుకుని బాగా చదువుకుని నేడు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ ఎంతో మంది పిల్లలకు సేవలందిస్తున్నామని యోగివేమన విశ్వ విద్యాలయ రిజిస్ట్రార్ పుత్తా పద్మ పేర్కొన్నారు. వివరాలు అమె మాటల్లోనే.. 'నా పేరు పుత్తా పద్మ, చెన్నూరు మండలం చిన్నమాచుపల్లి. తండ్రి నాగముని రెడ్డి, తల్లి సీరజ. మా నాన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్‌గా పనిచేస్తూ చివరిగా కడప ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పదవీ విరమణ పొందారు. ఆయన లెక్చరర్‌గా పని చేస్తూ ఎంతో మంది విద్యార్థులకు బోధనలందించి ప్రయోజకులను చేశారు. ఆయన స్ఫూర్తితో నేను కూడా బాగా చదువుకుని నేడు ఎంతో మంది విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నా. నేను ఎల్‌కేజీ నుంచి పదవ తరగతి వరకు కడపలోని విద్యామందిర్ స్కూల్లో చదువుకున్నాను. ఇంటర్‌ను అనంతపురంలోని నేషనల్ సాయిబాబా ఎయిడెడ్ కళాశాలలో, డిగ్రీ తిరుపతిలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో చదివాను. ఎంఏ, ఎంఫిల్ అనంతపురంలోని ఎస్‌కే యూనివర్సిటీలో, పీహెచ్‌డీ తిరుపతి మహిళా యూనివర్సిటీలో పూర్తి చేశాను. 1998లో నేను కడపలోని సుబ్బిరెడ్డి ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా చేరాను. 2006లో ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తూ 2007లో కడపలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలకు బదిలీపై వెళ్లాను.2007 చివరిలో కడప యోగివేమన యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా చేరా. 2013లో ప్రొఫెసర్‌గా అక్కడే పదోన్నతి పొందా. అక్కడ సీనియర్ ఫ్యాకల్టీగా, చీఫ్ ఎగ్జామినర్‌గా, ఉమెన్ కన్వీనర్‌గా, హెచ్ఓడిగా, డీన్‌గా పలు హోదాల్లో పనిచేశా. ప్రస్తుతం ఎస్‌కే యూనివర్సిటీకి కూడా బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఛైర్మన్‌గా, పులివెందుల జేఎన్‌టీయూకు బోర్డ్ ఆఫ్ స్టడీస్ మెంబర్‌గా పనిచేస్తున్నా.' కోవిడ్ సమయంలో వైవీయూలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా పనిచే సిన ఈమె జిల్లాలోని అన్ని కళాశాలల్లో కట్టుదిట్టంగా పరీక్షలను నిర్వహించి మంచిపేరు తెచ్చుకున్నారు.

## 'క్లిక్' అయ్యింది



మహిళా ఫొటోగ్రాఫర్ శ్వేత

కడపకు చెందిన శ్వేత మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్నప్పుడు ఆసక్తిగల వారు ఫొటోగ్రఫీ సర్టిఫికెట్ కోర్సులో చేరవచ్చని ఆ విభాగం ట్రైనర్ ప్రొఫెసర్ ఎం.గురుమోహన్‌రెడ్డి ప్రకటించారు. శ్వేత ఆ కోర్సులో చేరింది. మిగతా వారి కంటే శ్రద్ధగా ఫొటోగ్రఫీలో టెక్నిక్స్ నేర్చుకుంది. చక్కటి యాంగిల్స్‌లో ఫొటోలు తీస్తుండడంతో ఆమెకు పలు ప్రాజెక్టుల్లో ఫొటోలు తీసే అవకాశం లభించింది. ప్రస్తుతం శ్వేత ఔట్‌డోర్ ఫొటోగ్రఫీలో కూడా ప్రతిభ చాటుతోంది. ఇటీవల టెంపుల్ ఫొటోగ్రఫీ విభాగంలో ఆమె తీసిన పుష్పగిరి దేవాలయాల ఫొటోలను చూసిన నాటి జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

## 'అభాగ్యుల పాలిట 'స్వాతి'కిరణం



వృద్ధాశ్రమంలో సేవలు అందిస్తున్న స్వాతి

మదనపల్లె సిటీ: తనకు మాత్రమే ఎందుకు కష్టం వచ్చింది? అని ఆలోచించే బదులు నాలా మరెంత మందికి ఈ కష్టం వచ్చిందో.. వాళ్ల పరిస్థితి ఏమిటి అని ఆలోచించే మనస్తత్వం అతి కొద్ది మందికి మాత్రమే ఉంటుంది. అలాంటి రెండో కోవకు చెందుతుంది డాక్టర్ శంఖారపు స్వాతి. ఉద్యోగ,ఉపాధి కోసం తిరగని చోటంటూ లేదు. దీంతో తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనైనా నేడు ఆమె వేలాది మందికి నైపుణ్యాలను అందించి వారికి దారి చూపిస్తోంది. మదనపల్లె పట్టణానికి చెందిన డాక్టర్ స్వాతి తెలుగుభాషలో పీహెచ్‌డీ పూర్తి చేసిన తర్వాత పెద్దలు నిశ్చయించిన వారితో పెళ్లి చేసుకుని బెంగళూరులో అడుగుపెట్టింది. అంతా బాగానే ఉందనుకునే సమయానికి భర్తకు వ్యాపారంలో తీవ్రమైన నష్టాలు వచ్చాయి. దీంతో మరోదారి లేక డిగ్రీ పట్టా చేతపట్టి ఉద్యోగ వేటలో పడిన ఆమెకు ఎక్కడకెళ్లినా నిరాశే ఎదురయ్యేది. దీంతో మదనపల్లె పట్టణానికి చేరుకున్నారు. డబ్బు చెల్లించి కోర్సులు నేర్చుకునే స్తోమత లేక టైలరింగ్,కుట్లు, అల్లికలు, శారీరోలింగ్, ఫ్రాబిక్ పెయింటింగ్,ఎంబ్రాయిడరీ వంటి వాటిని ఆన్‌లైన్ ద్వారా సొంతంగా నేర్చుకుంటూ ప్రతిభను పెంచుకున్నారు.ఆకట్టుకునే డిజైన్లతో వస్త్రాలను కుట్టించేది. వచ్చిన డబ్బుతో బోటిక్, టైలరింగ్ షాపులను ప్రారంభించింది. ఈ క్రమంలోనే ఒంటరి మహిళలు, వితంతువులు,సమాజంలో పడే కష్టాలను గమనించింది. అలాంటి వారికి చేయూత ఇవ్వాలన్న లక్ష్యంతో ధాత్రి ఫౌండేషన్ ప్రారంభించింది. తొమ్మిది మందితో ప్రారంభమై నేడు వెయ్యి మందికిపైగా మహిళలు ఇందులో సభ్యులుగా ఉన్నారు. రోగులకు, రైతులకు, విద్యార్థులకు, మహిళలకు చేయూతనిచ్చి వారికి నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ కల్పించి సూక్ష్మ రుణాల ద్వారా ఉపాధి కల్పించి వారి వికాసానికి తోడ్పతున్నారు.

## మూగ జీవాలకు సేవ చేయాలనే లక్ష్యంతో..



డాక్టర్ శారదమ్మ, జిల్లా పశువైద్యాధికారి

కడప అగ్రికల్చర్: మాది వ్యవసాయ కుటుంబం. మా తల్లితండ్రులు కూడా వ్యవసాయంతోపాటు పాడి పశువులను పెంచే వారు. పాడి పశువులపై వారికి ఉన్న ప్రేమ చూసి నేను కూడా బ్యాచురల్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ పూర్తి చేశా.పశుసంవర్ధకశాఖలో ఉద్యోగాన్ని సంపాదించి వేల మూగజీవాలకు సేవలందిస్తున్నానని జిల్లా పశుసంవర్ధశాఖ అధికారి డాక్టర్ చెముడూరి శారదమ్మ చెబుతున్నారు. వివరాలు ఆమె మాటల్లో..మాది కలపాడు మండలం కలసపాడు గ్రామం. నేను 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఎగువ రామాపురంలో, 6,7,8 తరగతులను కలసపాడులో, 9, 10 తరగతులు పోరుమామిళ్లలో చదివాను. ఇంటర్‌ను కడపలోని బాలికల జూనియర్ కళాశాలలో, డిగ్రీ తిరుపతిలో పూర్తి చేశా.తర్వాత బ్యాచులర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ తిరుపతిలో పూర్తి చేశాను.

- 1993లో చాపాడు మండలం వెదురూరులో తొలిసారిగా పశువైద్యాధికారిగా ఉద్యోగంలో చేరా. మూగ జీవాలకు వైద్యసేవలందిస్తూ.. రైతు సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా పనిచేశాను. 2005 అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది జమ్మలమడుగు ప్రాంతంలో పలు మండలాల్లో పనిచేశా. 2014లో డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది కడపకు వచ్చా. ఇక్కడే పనిచేస్తూ 2021లో జిల్లా పశువైద్యాధికారిగా పదోన్నతి పొంది సేవలందిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా వైద్యులకు సూచనలు, సలహాలను అందిస్తూ రైతు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారు. తల్లితండ్రుల ఆశయాన్ని నేరవేరుస్తున్నందుకు ఆనందంగా ఉందని చెబుతున్నారు డాక్టర్ శారదమ్మ.

## ఓటమే విజయానికి నాంది



షేక్ అయిషా

మదనపల్లెకు చెందిన అయిషా ఇంజినీరింగ్ చదువుతున్న సమయంలోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించింది. లక్షల్లో జీతం అయినా తల్లిదండ్రులు ఇచ్చిన ప్రోత్సాహంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించి గ్రూప్–1కు సన్నద్ధమయ్యారు. తొలి ప్రయత్నం విఫలమైనా నిరాశ చెందలేదు. మళ్లీ పట్టుదలతో ప్రయత్నించి గ్రూప్–1 విజేతగా నిలిచింది. సాధారణ కుటుంబంలో పుట్టిన ఆమె అనకాపల్లి ఆర్డీవోగా విధులు నిర్వహిస్తున్నారు. మదనపల్లెకు చెందిన అహ్మద్ బాషా చిరువ్యాపారి. తల్లి సాధారణ గృహిణి. క్యాంపస్ ఇంటర్వ్యూలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చినా తాను సివిల్స్ రాయాలని ఉందని తల్లిదండ్రులకు చెప్పడంతో వారి ప్రోత్సాహంతో పోటీ పరీక్షలు రాసి విజేతగా నిలిచారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు కృషి



దేవిరెడ్డి శ్రీలక్ష్మి

కడప కోటిరెడ్డిసర్కిల్: బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేశారు. 12 మంది పిల్లలను అధికారికంగా దత్తత ఇవ్వడంలో ప్రధాన పాత్ర పోషించారు. వన్‌స్టాప్ వచ్చే కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. మిషన్ వాత్సల్య, మిషన్ శక్తి స్కీములను ప్రజలకు చేరువయ్యేలా కృషి చేశారు. గర్భిణులు, రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందేలా చూశారు. అమె ఎవరో కాదు జిల్లాలోని మహిళా శిశుసంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ దేవిరెడ్డి శ్రీలక్ష్మి. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఈమె ఎమ్మెస్సీ ఎంఈడీ చదివారు. బీఈడీ ఎంఈడీ తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పూర్తి చేశారు.మెదట సెకండరీ గ్రేడ్ టీచర్‌గా, తర్వాత స్కూల్ అసిస్టెంట్‌గా, జూనియర్ కళాశాల లెక్చరర్‌గా పనిచేశారు. 2007లో గ్రూప్–1కు సెలెక్ట్ అయ్యారు. డిప్యూటీ రిజిస్ట్రర్ డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్‌గా రాజంపేటలో విధులు నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ ఇన్ కడప మున్సిపల్ కార్పొరేషన్, తర్వాత తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో పని చేశారు. తర్వాత శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించారు.కడపలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా పని చేశారు.కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సెక్రటరీగా, వైస్ ఛైర్మన్‌గా పని చేశారు. ప్రస్తుతం మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.బెస్ట్ మున్సిపల్ కమిషనర్ అవార్డు చిత్తూరు కలెక్టర్ నుంచి అందుకున్నారు. కడప కలెక్టర్ చేతుల మీదుగా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా మెరిటోరియస్ అవార్డు అందుకున్నారు. ఇన్ని సాధించడం వెనక తల్లిదండ్రులు, అత్తమామ, భర్త గురుమోహన్‌రెడ్డి ప్రోత్సాహం ఉందని ఆమె చెబుతోంది.కష్టపడితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని అంటున్నారామె.

## బాలలు, మహిళల హక్కులే లక్ష్యం



బాలల హక్కుల పరిరక్షణ అవగాహన కార్యక్రమలో మాట్లాడుతున్న లలితమ్మ

మదనపల్లె సిటీ: సాయం చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు లలితమ్మ. మదనపల్లె పట్టణానికి చెందిన ఈమె లింగవివక్షకు గురైన బాధితురాలే. పెద్ద చదువులకు వెళ్లాలనుకున్నా పదో తరగతిలోనే చదువును ఆపాల్సి వచ్చింది. గాంధీ గ్రామీణాభివృద్ధి సంస్థలో బాల్వాడీ టీచర్‌గా పని చేసేందుకు 1990లో ములకలచెరువు వెళ్లారు 1992 తంబళ్లపల్లె చేరుకుని అక్కడే పీపుల్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(పోర్డు) స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. బాల్యవివాహాలను రూపుమాపడమే కాకుండా బడిమానేసిన వారికి తిరిగి పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. సెంటర్ ఫర్ వరల్డ్ సాలిడారిటీ, వాటర్ ఎయిడ్ ఇండియా, అమెరికాకు చెందిన చైల్డ్ రైట్స్ యు (క్రై) సంస్థలు ఆర్థిక చేయూత ఇవ్వడంతో బాలలు, మహిళల హక్కుల కోసం అనేక కార్యక్రమాలను చేపడుతున్నారు.

## బ్యాడ్మింటన్ రాకెట్.. హోత్రిశ్రీ




2023లో పాలిటెక్నిక్ బ్యాడ్మింటన్ పోటీల్లో చాంపిన్‌షిప్ ట్రోఫి అందుకుంటున్న హోత్రిశ్రీ (ఫైల్)

పీలేరు: పీలేరు పట్టణానికి చెందిన మాజీ సైనికుడు టి. ప్రభాకర్‌రెడ్డి కుమార్తె టి. హోత్రిశ్రీ బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా రాకెట్ వేగంతో దూసుకుపోతోంది. చిన్నతనం నుంచే బ్మాడింటన్‌పై పట్టు సాధించి అనేక విజయాలు సొంతం చేసుకుంది. తండ్రి ప్రోత్సాహంతో గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి క్రీడాకారిణిగా గుర్తింపు పొందుతోంది. ఆమె తండ్రి ప్రభాకర్‌రెడ్డి జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారుడు. తన ఆరవ ఏటలోనే బ్యాడ్మింటన్‌లో అడుగుపెట్టిన హోత్రిశ్రీ 2017లో గోపిచంద్ అకాడమీలో జరిగిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో పతకం గెలుపొందింది. రాజమండ్రిలో అండర్–15 విభాగంలో రాష్ట్ర చాంపియన్‌గా నిలిచింది. 2018లో నెల్లూరులో అండర్–14 విభాగంలో మినీ బ్యాడ్మింటన్ చాంపియన్‌గా నిలిచింది.2019లో ప్రొద్దుటూరు, బెంగళూరులో సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొని ప్రశంసాపత్రాలను అందుకుంది. 2019లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అబ్దుల్ కలాం పురస్కారాన్ని స్వీకరించింది.2021లో బెంగళూరులో జరిగిన పంజాబ్ నేషనల్ బ్యాంక్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజేతగా నిలిచింది.

- 2024 సెప్టెంబరులో కడప జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో మెరుగైన ప్రదర్శన కనబరచి చెన్నైలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు ఎంపికైనంది. ప్రస్తుతం కేఎంఎం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండవ సంవత్సరం చదువుతోంది. అంతర్జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా రాణించాలన్నదే తన లక్ష్యమని హోత్రిశ్రీ చెబుతోంది.

## క్లుప్తంగా

### నిత్యపూజకోనకు ఆర్టీసీ బస్సు

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** ప్రముఖ శైవ క్షేత్రమైన నిత్యపూజకోనకు భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సు సర్వీసును నడుపుతున్నామని ఆర్టీసీ కడప డిపో మేనేజర్ డిల్లీశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు కడప ఆర్టీసీ బస్టాండు, పాత బస్టాండ్, కృష్ణ సర్కిల్, శంకరాపురం, అప్సర సర్కిల్, చిన్న చౌక్, రామాంజనేయ పురం, భాకరాపేట ,సిద్ధవటం, ఎస్. రాజం పేట, వంతాటిపల్లె, అవులసత్రం మీదుగా నిత్యపూజకోనకు వెళుతుందన్నారు. ఈనెల 10వ తేదీన ఉదయం 07:00 గంటలకు కడప నుంచి బయలుదేరుతుదని, తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 2:30 -3.00 గంటల మధ్య (భక్తుల రద్దీ అధారంగా )పంచలింగాల నుంచి బయలుదేరి కడపకు చేరుతుందన్నారు. చార్జి రూ. 40గా నిర్ణయించామని తెలిపారు.

### పొలంలో కేబుల్ వైర్ల చోరీ

**ఖాజీపేట :** రైతుల పొలాల్లో కేబుల్ వైర్ల చోరీ చేసే దొంగలు మళ్లీ తమ చేతి ప్రతాపం చూపిస్తున్నారు. శుక్రవారం కన్నెలవాగు చెరువుకు వెళ్లే మార్గ మధ్యలోని ఇద్దరు రైతుల పొలాల్లో కేబుల్ కట్‌చేసి కాపర్ వైర్‌ను చోరీ చేశారు. అంతెం సుబ్బారాయుడు (కాటయ్య) అరటితోట సాగు చేస్తున్నాడు. తన పొలంలో ఉన్న కేబుల్ వైర్ 14 మీటర్లను దొంగలు కట్‌చేసి వెళ్లిపోయారు. పక్కపొలంలోని ములపాక ఈశ్వర్‌రెడ్డి మూడు ఎకరాల్లో అరటి సాగు చేస్తున్నాడు. మోటారు దగ్గర ఉన్న 25 మీటర్ల కేబుల్ వైర్‌ను కట్‌చేసి దొంగలు ఎత్తుకెళ్లారు. కేబుల్ వైర్ల చోరీ మండలంలో తరచూ జరుగుతూనే ఉన్నాయి. చోరీలపై పోలీసులకు రైతులు ఫిర్యాదు చేశారు.

### హత్య కేసులో నిందితుడి అరెస్టు



హత్యకేసులో నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ చల్లని దొర

**పెండ్లిమర్రి :** మండలంలోని గంగనపల్లె హరిజనవాడలో ఈనెల 2వ తేదీ రాత్రి భార్యను హత్య చేసి పరారైన నిందితుడిని అరెస్టు చేసినట్లు కడప రూరల్ సీఐ చల్లని దొర తెలిపారు. శుక్రవారం పెండ్లిమర్రిలో ఆయన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదనే కోపంతో భార్య లూర్దు మేరీని భర్త సుబ్బరాయుడు విచక్షణ రహితంగా కొట్టడంతో తీవ్ర గాయాలై మృతి చెందింది. మృతురాలి కుమార్తె నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేయగా భర్త సుబ్బరాయుడు హత్య చేసినట్లు తెలిసిందన్నారు. పరారీలో ఉన్న నిందితుడు రెవెన్యూ అధికారుల ద్వారా పోలీసు స్టేషన్‌కు హాజరై నేరాన్ని అంగీకరించారన్నారు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం జుడిషియల్ మేజిస్ట్రేట్ వద్దకు పంపామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

# యథేచ్ఛగా అక్రమ కట్టడాలు

- గ్రామ కంఠం భూములపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం
- డీ ఫారమ్ పొందిన స్థలాల్లో కట్టడాలు కూల్చేందుకు సన్నద్ధం
- వింత వైఖరిలో దువ్వూరు రెవెన్యూ అధికారులు



దువ్వూరులో గ్రామ కంఠం స్థలంలో వెలుస్తున్న అక్రమ కట్టడాలు

**సాక్షి ప్రతినిధి, కడప :** అది గ్రామ కంఠం స్థలం. సెంటు లక్షలాది రూపాయాలు పలుకుతున్న విలువైన భూమి. ఆ భూమిలో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయి. రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. తెలియదని భావిస్తే తప్పులో కాలేసినట్లే. ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతోందని ఫిర్యాదులున్నాయి. అయినా కూడా కట్టడి చేసేందుకు ప్రయత్నమే చేయలేదు. అక్రమ కట్టడాలు మేడలుగా వెలుస్తున్నాయి.

దువ్వూరు మండలం మారుమూల గ్రామంలో ఓ కుటుంబం 2009లో డీ ఫారమ్ పొందారు. 1935 నుంచి అక్కడే నివాసం ఉంటుండడంతో అప్పటి రెవెన్యూ అధికారులు మంజూరు చేశారు. ఆ స్థలంలో నివాసంతోపాటు డాబా కూడా నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతోంది. ఇంటి పన్నులు, కరెంటు బిల్లులు చెల్లింపులు కూడా ఉన్నాయి. అయితే డాబా కేసీ కెనాల్ పోరంబోకు స్థలంలో ఉందని కూల్చేందుకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ పరస్పర విరుద్ధ వైఖరికి దువ్వూరు రెవెన్యూ యంత్రాంగం తెరలేపింది.

మండల కేంద్రమైన దువ్వూరులో సర్వే నంబర్లు 387/27లో 1.84 ఎకరాలు, 371/25లో 1 ఎకరం, 371/24లో 1.24 ఎకరాలు, 1430లో 50 సెంట్లు, 371/3లో 82 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. రెవెన్యూ రికార్డుల్లో సైతం గ్రామకంఠంగా ఉంది. ఆయా భూముల్లో గ్రామ సచివాలం, స్త్రీ శక్తి భవనం, వ్యవసాయ, హౌసింగ్ కార్యాలయాలు సైతం వెలిశాయి. ఆ ప్రాంతంలో సెంటు లక్ష రూపాయాలు పైబడి ధర పలుకుతోంది. ఈ పరిస్థితుల్లో గ్రామ కంఠం భూమి అన్యాక్రాంతమవుతోంది. అక్రమ కట్టడాలు యథేచ్ఛగా వెలుస్తున్నాయి. కట్టడి చేయాలని గ్రామస్థులు, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సైతం జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. రెవిన్యూశాఖ నుంచి ఆశించిన ఫలితం కనిపించలేదు. పునాదులు పెద్ద పెద్ద భవంతులుగా వెలుస్తున్నా, అటువైపు రెవెన్యూ అధికారులు కన్నెత్తి చూడడం కూడా చేయలేదు. అధికార పార్టీ మద్దతుదారులు ఆక్రమణదారులుగా అవతరించడమే అసలు కారణం.

**ఇడమడకలో శరవేగంగా పావులు....**

దువ్వూరు మండలం ఇడమడక గ్రామంలో నగిరి సుబ్బమ్మ, నగిరి సుభాషిణిలకు 2009లో రెవెన్యూ అధికారులు డీఫారమ్‌తోపాటు అనుబంధ ఫారమ్ (నివేశస్థల స్వాధీన ధ్రువీకరణ పత్రం) ఇచ్చారు. వారి కుటుంబం అదే స్థలంలో1935 నుంచి జీవిస్తున్నారు. అక్కడే ఇల్లు, పక్కనే డాబా పెట్టుకొని జీవనం గడుపుతున్నారు. ఇంటిపన్నులు, విద్యుత్ బిల్లులు అన్నీ ఉన్నాయి. దాదాపు 90 ఏళ్లుగా మూడు తరాలకు చెందిన ఆ కుటుంబ సభ్యులు అక్కడ జీవిస్తున్నారు. కాగా రెవెన్యూ అధికారులు కేసీ కెనాల్ స్థలమంటూ కూల్చేందుకు నోటీసులు జారీ చేశారు.

**ఇరిగేషన్ అధికారుల ఫిర్యాదు మేరకే...**

ఇడమడక గ్రామంలో శ్రీకాంత్ కుటుంబం కేసీ కెనాల్ స్థలాన్ని ఆక్రమించుకున్నారని ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు తహసీల్దార్ కోర్టులో విచారణ చేపట్టాం. శ్రీకాంత్ కుటుంబానికి మంజూరైన డీఫారమ్ సర్వే నంబర్లు వేరుగా ఉన్నాయి. విచారణలో ఆ విషయం తేటతెల్లమైంది. తీర్పు వెలువడిన తర్వాత ఆర్డీఓ కోర్టుకు కూడా వెళ్లారు. అక్కడ కూడా కేసీ కెనాల్ స్థలమేనని తీర్పు లభించింది. ఆ మేరకే నోటీసులు జారీ చేశామని దువ్వూరు తహసీల్దార్ అక్బర్‌బాషా తెలిపారు.

**కక్ష్య సాధింపు చర్యలకు అండగా....**

ఇడమడక గ్రామంలో ఎన్నికలకు ముందు నగిరి సుభాషిణి భర్త శ్రీకాంత్ మద్దతును తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు. అప్పట్లో రాజకీయాలతో నిమిత్తం లేకుండా తన పని చేసుకున్న శ్రీకాంత్‌కు తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో ఇబ్బందులు తలెత్తాయి. ఎలాగైనా సరే శ్రీకాంత్ కుటుంబం పొట్ట కొట్టాలనే తలంపుతో అధికార పార్టీ నేతలు ఉన్నారు. వారి సిఫార్సులకు అనుగుణంగా రెవెన్యూ అధికారులు చర్యలున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. మరోవైపు తెలుగుదేశం నేతలను ప్రసన్నం చేసుకోవాలని దువ్వూరు రెవెన్యూ అధికారులు ఉచిత సలహా కూడా ఇస్తున్నట్లు సమాచారం. దీనిని బట్టి టీడీపీ నేతల కళ్లల్లో ఆనందం చూసేందుకో సమే రెవెన్యూ యంత్రాంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది.

### గంజాయి రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు



ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో తనిఖీ చేస్తున్న సీఐలు రమణారెడ్డి, యుగంధర్

**ప్రొద్దుటూరు క్రైం :** గంజాయి అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా నార్కోటిక్ కంట్రోల్ సెల్, ప్రొద్దుటూరు పోలీసు అధికారులు హెచ్చరించారు. పట్టణంలోని ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, గోడౌన్‌లలో శుక్రవారం డీఎన్‌సీసీ, పోలీసు అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో గంజాయిని పూర్తిగా కట్టడి చేసే క్రమంలో వివిధ ప్రాంతాల నుంచి జిల్లాకు గంజాయి రవాణా జరగకుండా జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ప్రత్యేక చర్యలు చేపట్టారని డీఎన్‌సీసీ సీఐ రమణారెడ్డి, టూ టౌన్ సీఐ యుగంధర్‌లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రొద్దుటూరు పట్టణంలో ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, గోడౌన్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. వస్తు రవాణా వాహనాల్లో గంజాయి రవాణా జరిగితే ట్రాన్స్‌పోర్టు యాజమాన్యాలను కూడా బాధ్యులను చేస్తామని హెచ్చరించారు.

### అంగన్వాడీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

**కాశినాయన :** మండలంలోని కోడిగుడ్లపాడు మెయిన్ అంగన్వాడీ కేంద్రం కార్యకర్త టి.గురుదేవి శుక్రవారం వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పండింది. వెంటనే వారి బంధువులు గమనించి పోరుమామిళ్ళ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్ళారు. అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే కోడిగుడ్లపాడు అంగన్వాడీ కేంద్రానికి నాడు–నేడు పనుల కింద రూ.14 లక్షలు నిధులు మంజూరయ్యాయి. కార్యకర్తే భవనాన్ని నిర్మించుకున్నారు. అయితే పోరుమామిళ్ల ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీఓ లక్ష్మీదేవి రూ.22 వేలు డబ్బులివ్వాలని వేధించడం వలన కార్యకర్త గురుదేవి ఒకసారి రూ.10 వేలు, ఒకసారి రూ.12 వేలు ఇచ్చినట్లు గురుదేవి తెలిపారు. అంగన్వాడీ కేంద్రం కోడ్ మార్చేందుకు రూ.20 వేలు సీడీపీఓ అడిగిందని వాపోయింది. వేధింపులు తాళలేక వాస్మోల్ సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని బంధువులు తెలిపారు. ఈ విషయమై ఇన్‌చార్జి సీడీపీఓ లక్ష్మీదేవిని వివరణ కోరగా నాడు–నేడు పనులకు మాకు ఎటువంటి సంబంధం లేదని, అది ఇంజినీర్లు చూసుకుంటారని, నేను ఆమె వద్ద డబ్బులు తీసుకోలేదని తెలిపారు.

### ఉద్యోగ భద్రత కల్పించాలని ఆర్టీసీ ఎండీకి వినతి

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** రాష్ట్రంలో ఆర్టీసీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 8 వేల ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముత్యాలరావు, కుమారనాయక్ కోరారు. శుక్రవారం విజయవాడలోని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావును కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీలో కాంట్రాక్టు వ్యవస్థల వల్ల రోజురోజుకు కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాంట్రాక్టర్ మారే ప్రతిసారి కార్మికులను ఉద్యోగం నుంచి తొలగిస్తూ కొత్త వారిని తీసుకుంటామని బెదిరింపులకు గురిచేస్తున్నారన్నారు.

### నేడే జాతీయ లోక్ అదాలత్

**కడప అర్బన్:** జిల్లా న్యాయసేవాధికారసంస్థ, కడప వారి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో ఈనెల 8న ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయలోక్ అదాలత్ నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 16 బెంచీలను ఏర్పాటు చేశారు.

## సమస్య పరిష్కారం కానిదే ప్రజాభిప్రాయ సేకరణ వద్దు

ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ముందు కన్నీరు పెట్టుకుంటున్న మహిళలు

**మైలవరం :** దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీతో ఇబ్బందులు పడుతున్న గ్రామస్థుల సమస్యలను పరిష్కారం చేయకుండానే యాజమాన్యం విస్తరణ పనులకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడం సరైంది కాదని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దుగ్గన పల్లి గ్రామంలో మిర్చి రైతు ఛీపాటి మోషే ఆత్మహత్య చేసుకోవడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించడంతో పాటు మృతదేహానికి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా గ్రామస్థులందరూ మోషే మరణానికి పంట దిగుబడే కాకుండా తమ గ్రామాలకు పక్కనే ఉన్న దాల్మియా సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న ధూమ్ము ధూళీతోపాటు బూడిద పంటలపై పడటం, కాంపౌండ్ ప్రహరీ నిర్మాణం వల్ల వర్షకాలంలో పొలాల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండటం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని ఎమ్మెల్సీ ముందు వివరించారు. అనంతరం ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ సమస్యలున్న గ్రామాలల్లో వాటి పరిష్కారానికి ప్రయత్నం చేయకుండా ఆగమేఘాలపై ప్రజాభిప్రాయ సేకరణ నోటిఫికేషన్ ఇవ్వడం ఎమిటని ప్రశ్నించారు. 4.6 మెట్రిక్ టన్నుల నుంచి 12.6 మెట్రిక్ టన్నులకు ఉత్పత్తి పెరిగితే ప్రస్తుతం వస్తున్న నష్టాలు మరింతగా పెరిగే అవకాశం ఉందన్నారు. వర్షపు నీరు వంకల్లో ప్రవహించకుండా దాల్మియా యాజమాన్యం వంకలను పూర్తిగా ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేశారు. నేను కూడా సివిల్ ఇంజినీర్‌నేనని, నీటి ప్రవాహం ఏ మేరక ప్రవహిస్తుందో అర్థం చేసుకోగలనన్నారు. కొంత మంది అధికారులు తప్పుడు రిపోర్టులతో పరిసర గ్రామస్థులను మరింత నష్టపరిచేలా చేస్తున్నారన్నారు.

జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని గ్రామాలల్లో పర్యటించి సమస్యను పరిష్కరం చేయాలన్నారు. కార్యక్రమంలో పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి జిల్లా అధికార ప్రతినిధి మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ మహేశ్వరరెడ్డి, శివగుర్విరెడ్డి, ఆంజనేయులు, వినయ్‌రెడ్డి, మున్సిపల్ జిల్లా అధ్యక్షుడు హృషికేశవరెడ్డి,పోరెడ్డి మహేశ్వరరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతి క్షేత్రంపై కూటమి ప్రభుత్వం కక్ష

- భక్తుల మనోభావాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే
- నిర్మాణాలు కూలగొట్టడం సరికాదు
- ఎమ్మెల్సీ గోవిందరెడ్డి



**పోరుమామిళ్ల :** జ్యోతి క్షేత్రంపై కూటమి ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నట్లు ఉంది. లక్షలాదిమంది భక్తులకు ఆరాధనీయుడైన కాశినాయన జ్యోతిక్షేత్రంలో నిర్మాణాలు కూల్చి వేయడం సరికాదని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం జ్యోతిక్షేత్రంలో మూడు కట్టడాలు కూలగొట్టడంపై ఎమ్మెల్సీ స్పందించారు. సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కడప, కర్నూలు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కాశినాయన భక్తులు ఉన్నారని, ఆయన పేరుతో ఎన్నో ఆశ్రమాలు, ఆలయాలు వెలశాయన్నారు. జ్యోతిక్షేత్రంలో సంవత్సరానికి ఒకసారి జరిగే ఆరాధనకు లక్షల మంది భక్తులు వస్తున్నారన్నారు. గత మూడు దశాబ్దాలుగా ప్రతిరోజూ ఇక్కడికి భక్తులు వస్తున్నారని, నిత్య అన్నదానం సజావుగా కొనసాగుతోందన్నారు. ఫారెస్టు అధికారులు అక్కడ కట్టడాలు కూలగొట్టడం అన్యాయమన్నారు. రెండు నెలలకిందటే అటవీశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని, అయినా ఇపుడు దుర్మార్గంగా కూలగొట్టడం కూటమి ప్రభుత్వం కక్షతో చేస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. అడవుల్లోనే దేవస్థానాలు ఉన్నాయని, తిరుపతి, శ్రీశైలం తదితర వేలాది దేవస్థానాలు అడవుల్లో ఉన్నాయని, ఇక్కడ జ్యోతి నరసింహస్వామి దేవస్థానం ఎన్నో శతాబ్దాలుగా ఉందన్నారు. అక్కడే కాశినాయన దేహపరిత్యాగం చేయడంవల్ల ఆయన ఆలయం నిర్మించారన్నారు. ఎంతో ప్రసిద్ధి పొందిన కాశినాయన ఆశ్రమం కూలగొట్టేందుకు జరుగుతున్న ప్రయత్నం మంచిది కాదన్నారు. ప్రజల మనోభావాలు దెబ్బతీసే ప్రయత్నం విరమించుకొని ప్రభుత్వం భక్తులు ఆందోళన చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ఎంపీ నిధులతో, ప్రభుత్వ నిధులతో అక్కడ అభివృద్ధి పనులు చేయడం జరిగిందని, ఇప్పుడు ఈ ప్రభుత్వంలో ఎందుకు ఇలాంటి ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్నారో తెలియడం లేదన్నారు. ప్రభుత్వం, అటవీశాఖ మంత్రి స్పందించి భక్తుల ఆశలను కాపాడాలన్నారు.

## కేసీ కెనాల్‌కు ఏప్రిల్ 15 వరకు నీరివ్వాలని వినతి

**కడప సెవెన్‌రోడ్స్ :** కేసీ కెనాల్‌కు ఏప్రిల్ 15 వరకు సాగునీరు అందించి పంటలను ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి శుక్రవారం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరికి విన్నవించారు. కెనాల్‌కు నీరు రాకపోవడంతో మిరప, మినుము, వరి, పెసర, పసుపు పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీశైలం జలాశయంలో 846.7 అడుగుల నీరు మాత్రమే ఉందన్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా 841 అడుగులు చేరే వరకు నీరు డ్రా చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వద్ద 15 రోజుల క్రితమే నీరు నిలిపివేశారన్నారు. ముచ్చుమర్రి లిఫ్ట్ వద్ద నుంచి కేసీ కెనాల్‌కు 805 అడుగుల వరకు నీటిని తీసుకునే వీలుందన్నారు. ఈ పరిస్థితుల్లో పోతిరెడ్డిపాడు, ముచ్చుమర్రి ద్వారా నీటిని వదిలి కేసీ కెనాల్ ఆయకట్టు పైర్లను కాపాడాలన్నారు. కనీసం మార్చి చివరి వరకైనానీరు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న వేసవిలో బోరు బావుల్లో భూగర్భ జలాలు పెరిగేలా చర్యలు చేపట్టి తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. రాజోలి జలాశయాన్ని 2.95 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తే కేసీ కెనాల్ కింద రెండు పైర్లు సాగు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.

### నాటుసారా నిర్మూలనే లక్ష్యం

**కడప వైఎస్ఆర్ సర్కిల్:** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యక్రమమైన నవోదయం 2.0 పథకం అమలులో భాగంగా రాష్ట్రంలో నాటుసారా నిర్మూలనే లక్ష్యమని జిల్లా ప్రొహిబిషన్‌అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో బెల్లం వ్యాపారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బెల్లం వ్యాపారులు తమ వద్ద ఉన్న స్టాక్, అమ్మకాలు తదితర వివరాలను ప్రతి 15 రోజులకు ఒకసారి ఎక్సైజ్ స్టేషన్‌కి నివేదించాలన్నారు. అలాగే, బెల్లం అమ్మకాలు నాటుసారా తయారీదారులకు జరపరాదన్నారు. నాటుసారా తయారీకి బెల్లాన్ని సరఫరా చేసినట్టు తేలినట్లయితే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి.కృష్ణకుమార్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె. నరసింహారావు సిబ్బంది పాల్గొన్నారు.

### 34 ఎర్రచందనం దుంగలు స్వాధీనం


**బద్వేలు అర్బన్ :** బద్వేలు ఫారెస్టు రేంజ్ పరిధిలోని బ్రాహ్మణపల్లె సెక్షన్ సి.రామాపురం బీట్‌లోని అటవీప్రాంతంలో అక్రమంగా తరలిచేందుకు సిద్ధంగా ఉన్న 34 ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేయడంతో రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేర్కొన్నారు. స్థానిక సిద్ధవటం రోడ్డులోని ఫారెస్టు బంగ్లా ఆవరణలో శుక్రవారం ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బ్రాహ్మణపల్లె సెక్షన్ రామాపురం అటవీప్రాంతంలో గల ఎద్దులబోడు ప్రాంతంలో ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచారని టాస్క్‌ఫోర్స్ ఉన్నతాధికారులకు రాబడిన సమాచారం మేరకు ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ నరేష్ బృందం గురువారం నుండి అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో అటవీ ప్రాంతంలో అనుమానాస్పదంగా రెండు ద్విచక్ర వాహనాలు, ముగ్గురు వ్యక్తులు తారసపడ్డారు. వారు టాస్క్‌ఫోర్స్ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నం చేయగా టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వెంబడించి పట్టుకున్నారు. వారిని విచారించగా సమీప అటవీ ప్రాంతంలో దాచి ఉంచిన 34 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామని, దుంగల విలువ సుమారు రూ.32 లక్షలు ఉంటుందని వారు తెలిపారు. దుంగలతో సహా స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసుస్టేషన్‌కు తరలించారని, ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని వారు తెలిపారు.

### 'బేసిక్ ప్రైమరీ పాఠశాలలను రద్దు చేస్తే ఉద్యమిస్తాం'

**కడప ఎడ్యుకేషన్:** అసంబద్ధంగా తరగతుల విలీనాన్ని చేస్తూ బేసిక్ ప్రైమరీ పాఠశాలలను రద్దు చేయాలని చూస్తే ఉద్యమిస్తామని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాషా నర్రెడ్డి సంగమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వారు కడపలో విలేకరులతో మాట్లాడుతూ 117 జీవో రద్దు పేరుతో పాఠశాలల పునర్విభజన ప్రక్రియలో భాగంగా మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పరుస్తున్నామని చెబుతూ బేసిక్ ప్రైమరీ పాఠశాలలలోని 3,4,5 తరగతుల విద్యార్థులను ఐదు కిలోమీటర్ల పరిధిలోని మోడల్ ప్రైమరీలకు విలీనం చేస్తూ మండల స్థాయి అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారన్నారు. అలాగే మూడో తరగతి విద్యార్థి తన గ్రామంలో ఉన్న బడిని కాదని ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మరొక ప్రాథమిక పాఠశాలకు ఎలా వెళ్లగలరని ప్రశ్నించారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు ఆలోచించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కోరారు. ఈ విధానం ప్రాథమిక విద్యావ్యవస్థకు పెను ప్రమాదమని, తక్షణం గ్రామాల్లో బేసిక్ ప్రైమరీ పాఠశాలలను కాపాడుకోవడానికి చైతన్యం తీసుకురావాలన్నారు.

# అసెంబ్లీలోనూ అబద్ధాలా..?

- జగనన్న కాలనీల నిర్మాణాలపై రూ.700–800 కోట్ల అవినీతా?
- ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమి విలువ రూ.162.53 కోట్లు మాత్రమే
- రైతుల పేర్లతోనే బ్యాంకుల్లో డబ్బు జమ



రామేశ్వరంలోని జగనన్న కాలనీ (ఫైల్)

**ప్రొద్దుటూరు :** వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోని ఇళ్ల నిర్మాణానికి మొత్తం 476.06 ఎకరాల ప్రభుత్వ, ప్రైవేటు భూమిని అధికారులు సేకరించారు. ఇందు కోసం ప్రైవేట్ వ్యక్తుల భూమి కొనుగోలుకు సంబంధించి రూ.162,53,46,033.60 చెల్లించారు. పలు మార్లు అప్పటి రెవెన్యూ అధికారులు రైతులతో సమావేశాలు నిర్వహించి భూమిని కొనుగోలు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భూముల కొనుగోలుకు సంబంధించిన మొత్తాన్ని రైతుల బ్యాంకుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. కాగా ఈ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి రూ.700–800 కోట్ల అవినీతి జరిగిందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి గురువారం అసెంబ్లీలో మాట్లాడటం చర్చాంశనీయంగా మారింది.

**కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో..**

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోపూర్వం ప్రతి ఏటా పేదలకు 500 లోపుగానే ఇళ్లు మంజూరు చేసే పరిస్థితి ఉండేది. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ నియోజకవర్గానికి సంబంధించి ఒక్క ఇంటి నిర్మాణానికి కూడా భూ సేకరణ జరగలేదు. త ద్వారా పేదలు తీవ్రంగా నష్టపోయారు. టిడ్కో ఇళ్ల ని ర్మాణం మధ్యలో ఆగిపోయిన విషయం తెలిసిందే. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు – పేదలందరికి ఇళ్లు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విడతల వారిగా కాకుండా ఎంత మందికి అర్హత ఉంటే అంత మందికి ఇళ్లు మంజూరు చేయాలని నిర్ణయించారు. సచివాలయాల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు.

**వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో..**

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదల ఇళ్ల కోసం ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తులకు సంబంధించిన 476.06 ఎకరాల భూమిని సేకరించారు. ఇందులో రామేశ్వరం జగనన్న కాలనీకి సంబంధించి ఎకరా రూ. 27,63,750 ప్రకారం 70.34 ఎకరాలకు రూ.34,73, 20,462.50 చెల్లించారు. బొల్లవరం జగనన్న కాలనీకి సంబంధించి ఎకరా రూ.40,26,667 ప్రకారం 213.30 ఎకరాలకు రూ.85,88,88,071.10 చెల్లించారు. మీనాపురం జగనన్న కాలనీకి సంబంధించి ఎకరా రూ.40లక్షల ప్రకారం 104.73 ఎకరాలు భూమికి రూ.41,89,00,000 చెల్లించారు. ఇవి కాక గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ భూమిని సేకరించి 894 ఇళ్లను మంజూరు చేయడం జరిగింది. ప్రొద్దుటూరు మండలంలోని మూడు జగనన్న కాలనీలకు సంబంధించి మున్సిపాలిటీ పరిధిలోని 41 వార్డులతోపాటు కొత్తపల్లె, గోపవరం, బొల్లవరం సోములవారిపల్లె, దొరసానిపల్లె, చౌటపల్లె గ్రామాలను కలపడం జరిగింది. ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి సంబంధించి 15,825, గ్రామాలకు సంబంధించి 5,763 కలిపి మొత్తం 21,588 ఇళ్ల పట్టాలను తొలి విడతగా మంజూరు చేశారు. వచ్చిన దరఖాస్తులను బట్టి జగనన్న కాలనీల్లో అదనంగా ఇంటి పట్టాలు మంజూరు చేశారు.

**నిర్మాణంలో ఆలస్యం**

చాలా కాలం తర్వాత ఒకే మారు ప్రభుత్వం ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు స్వీకరించడంతో పెద్ద ఎత్తున ప్రజలు దరఖాస్తు చేసుకున్నారు. వేల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు మంజూరయ్యాయి. ఎలాగైనా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పలు మార్లు సమీక్షలు నిర్వహించి అధికారులపై ఒత్తిడి చేశారు. ఇప్పటికీ చాలా మంది కాంట్రాక్టర్లకు ప్రభుత్వం నుంచి బిల్లులు రావాల్సి ఉంది. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ఇందులో రూ.కోట్ల అవినీతి జరిగిందని అసెంబ్లీలో ఎమ్మెల్యే వరద మాట్లాడటం హాస్యాస్పందంగా ఉంది.

**విజిలెన్స్ విచారణ**

ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఇళ్ల నిర్మాణంపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని సీఎంకు ఫిర్యాదు చేశారు. పలు మార్లువిజిలెన్స్ అధికారులు విచారణ జరిపారు. విచారణ తమకు అనుకూలంగా జరగలేదని ఎమ్మెల్యే ఈ సందర్భంగా వారిని కూడా విమర్శించారు.